
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కడప
జిల్లా వార్తలు

5

గురువారం 27 నవంబరు 2025



అట్టహాసంగా ప్రసాద్‌రెడ్డి ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేసిన ఏపీఐఐసీ డైరెక్టర్ వద్దిబోయిన ప్రసాద్‌రెడ్డి

బద్వేలుటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఐఐసీ డైరెక్టర్‌గా నియమితులైన బి.ప్రసాద్‌రెడ్డి మంగళగిరిలో బుధవారం అట్టహాసంగా ప్రమాణస్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అభిమానులు, కార్యకర్తలు భారీ గజమాలలతో, శాలువాలతో సన్మానించారు. ప్రసాద్‌రెడ్డి ప్రమాణస్వీకారానికి బద్వేలు నియోజకవర్గ వ్యాప్తంగా భారీగా అభిమానులు, కార్యకర్తలు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉందన్నారు. చదువుకున్న యువతీ యువకులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు హైదరాబాదు, చెన్నై, బెంగళూరు నగరాలకు వెళుతున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రానికి పరిశ్రమలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. బద్వేలు నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేశ్‌కుమార్‌రెడ్డి సహకారంతో తనవంతు కృషిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేశ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, గోపవరం జడ్పీటీసీ జయరామిరెడ్డి, బద్వేలు టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, బ్రాహ్మణపల్లె సొసైటీ చైర్మన్ టి.రామానాయుడు, మాజీ సర్పంచ్ కాసా వెంకటసుబ్బారెడ్డి, రైస్‌మిల్లు ప్రసాద్, రాగిమాను ప్రతాప్‌కుమార్, శివయ్యస్వామి, సాయి కిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు బిజీబిజీగా జగన్



కోటి సంతకాల కార్యక్రమంలో సంతకం చేస్తున్న వైఎస్ జగన్

పులివెందుల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోరోజు బుధవారం బిజీబిజీగా గడిపారు. బుధవారం ఉదయం 9గంటల ప్రాంతంలో ఇంటి నుంచి క్యాంప్ కార్యాలయానికి వచ్చారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, అభిమానులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేస్తోందని అది ఆపాలని వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ పత్రంలో జగన్ సంతకం చేశారు. క్యాంప్ కార్యాలయం నుంచి పట్టణంలోని వాసవి కళ్యాణమండపంలో జరుగుతున్న వివాహానికి జగన్ హాజరయ్యారు. అక్కడ నుంచి మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లె సమీపంలో ఉన్న అరటితోటల పరిశీలనకు వెళ్లారు. అక్కడున్న రైతులతో అరటి పంట పరిస్థితి, ధరల పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం రైతులను పూర్తిగా గాలికి వదిలేసిందన్నారు. 18నెలల కాలంలో రైతులకు చంద్రబాబు చేసింది గుండుసున్నా అన్నారు. అనంతరం లింగాల, వేముల మండలంలోని వైసీపీ కార్యకర్తల ఇంటికి వెళ్లారు. సాయంత్రం 6గంటల ప్రాంతంలో క్యాంప్ కార్యాలయానికి చేరుకుని ప్రజాదర్బార్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, సతీశ్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య వద్దు..
కడపే ముద్దు..!

- ఇక్కడే కొనసాగించాలి
- సిద్దవటం, ఒంటిమిట్ట మండల ప్రజలు



(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో జిల్లాల పునర్విభజనలో జరిగిన తప్పులను సరిదిద్దేందుకు సీఎం చంద్రబాబు చేపట్టిన పునర్విభజన వ్యవహారం మళ్లీ దుమారం రేపుతోంది. ఎప్పటి నుంచో కడప జిల్లాలో ఉన్న సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలను అన్నమయ్య జిల్లా పరిధిలోకి తీసుకువస్తూ ప్రభుత్వం నిర్ణయించడాన్ని ఆ రెండు మండలాల జనాలతో పాటు జిల్లావాసులు జీర్ణించుకోలేకపోతున్నారు. కడపకు కూతవేటు దూరంలో ఉన్న ఆ రెండింటినీ సుమారు 90 కి.మీ దూరంలో ఉన్న అన్నమయ్య జిల్లాలోని రాయచోటి పరిధిలోకి తీసుకురావడాన్ని జనం, టీడీపీ ఇష్టపడటం లేదు. ఆ రెండింటితో జిల్లావాసులకు మంచి అనుబంధం ఉంది. ముఖ్యంగా పూర్వ సిద్దవటం, ఒంటిమిట్టతో బంధం ఉంది. ఇక ప్రతియేటా శ్రీరామనవమి సందర్భంగా ప్రభుత్వ లాంఛనాలతో శ్రీరాముని కల్యాణం నర్వహిస్తారు. ఇది జిల్లావాసులు చాలా గర్వంగా ఫీలవుతుంటారు. ఇలాంటి ఒంటిమిట్టను అన్నమయ్య జిల్లాపరిధిలోకి తీసుకుపోడాన్ని జిల్లావాసులు అంగీకరించడం లేదు.

అంత దూరమా

ఒంటిమిట్ట మండల జనాభా 33,100. ఒంటిమిట్ట నుంచి కడపకు 25 కి.మీ ఉంది. ఇప్పటిదాకా ఈ మండలం కడపజిల్లా పరిధిలో ఉంది. అసెంబ్లీ నియోజకవర్గం రాజంపేట అయినప్పటికీ రెవెన్యూ, జిల్లా హెడ్ క్వార్టరు కడప. దీంతో రెవెన్యూ పనులకోసం, ఆర్డీవో కార్యాలయానికి సులువుగా వచ్చి వెళ్లేవారు. ప్రస్తుతం ఒంటిమిట్ట మండలంలో మొత్తం 13 గ్రామ పంచాయతీలున్నాయి. ఇది అన్నమయ్య జిల్లా పరిధిలోకి వెళ్లడంతో జిల్లా కేంద్ర వైన రాయచోటికి రావాలంటే అక్కడ నుంచి కడపకు వచ్చి కడప నుంచి రాయచోటికి వెళ్లాలి. ఒంటిమిట్ట మండలం మంటపంపల్లె, చింతలరాజుపల్లె పంచాయతీల వారు రాయచోటికి చేరాలంటే రెండు బస్సులు మారి సుమారు 85 కి.మీ పైగా ప్రయాణించాలి.

అడుగు తీసి అడుగు వేస్తే కడపనే

సిద్దవటం కడపకు కూతవేటు దూరంలో ఉంది. మండల కేంద్రం 22కి.మీ దూరం మాత్రమే. పూర్వం ఇది జిల్లా హెడ్‌క్వార్టరు. మొత్తం 18 గ్రామ పంచాయతీలున్నాయి. సుమారు 40వేల మంది జనాభా ఉంది. సిద్దవటం కోట, చారిత్రక కట్టడాలున్నాయి. ఇక్కడి ప్రజలు అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటికి రావాలంటే రెండు బస్సులు మారి 75 కిమీ వెళ్లాలి. ఇది చాలా దూరం. పక్కనున్న కడప వదిలేసి ఎక్కడో దూరంగా వెళ్లాలంటే చాలా ఇబ్బంది. దీంతో ఈ మండల ప్రజలు కూడా అన్నమయ్య జిల్లాలో కలపడాన్ని అంగీకరించడం లేదు.

పునరాలోచించాలి



ఎంతో చరిత్ర కలిగిన ఒంటిమిట్టను కడపలో నుంచి వేరుచేసి అన్నమయ్యలో కలపడం చాలా బాధాకరం. 25కి.మీ ఉన్న కడపను కాదని 75 కి.మీ దూరంలో ఉన్న అన్నమయ్యకు మార్చాలని కమిటి సిఫారసు చేయడం మంచిది కాదు. ఒంటిమిట్ట రామాలయం అంటే కడపజిల్లా అనే పేరుంది. ప్రభుత్వం పునరాలోచించుకోవాలి.

- లక్ష్మినారాయణ, మాజీ ఎంపీపీ

కడపే కావాలి



మాకు కడప 20కి.మీ దూరం ఉంది. ఒంటిమిట్ట నుంచి అరగంటలో వెళ్లవచ్చు. పనులు చేసుకుని మధ్యాహ్నం కల్లా రావచ్చు. రాయచోటికి పోవాలంటే 3గంటల సమయం పడుతుంది. వ్యయ ప్రయాసలకోర్చాలి. కడపలోనే కొనసాగించాలి.

- రోశయ్య, ముకుందాశ్రమం, కొత్తమాధవరం

90 కి.మీ దూరం



ఒంటిమిట్ట మండలాన్ని కడపలోనే కొనసాగించాలి. అన్నమయ్య జిల్లాకు మారిస్తే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి. రాయచోటి వెళ్లాలంటే రెండు బస్సులు మారాలి. శివారు ప్రాంతాలైన చింతరాజుపల్లె, కోనరాజుపల్లె వాళ్లు వెళ్లాలంటే 90కిమీ దూరం.

- ఈశ్వరయ్య, ఒంటిమిట్ట

కడపకు 15 నిమిషాల్లో వెళతాం



కడప కార్పొరేషన్ దగ్గరలోనే సిద్దవటం మండలం ఉంది. మండలంలో ఏదైనా సమస్య ఉన్నా కలెక్టరు, ఆర్డీవోను కలవాలంటే 15 నిమిషాల్లో కడపకు పోతాం. మధ్యాహ్నం లోపు పని చూసుకుని తిరిగి వస్తాం. అంత దగ్గరగా ఉన్న మండలాన్ని 70కి.మీ దూరంలో ఉండి అన్నమయ్య జిల్లా రాయచోటికి మార్చడం బాధాకరం.

- ప్రతాప్, టీడీపీ నాయకుడు, సిద్దవటం

కడపలోనే ఉంచాలి



ఒంటిమిట్ట కోదండ రామాలయంలో 2014లో చంద్రబాబు సీఎంగా వచ్చిన తరువాత అధికార లాంచనాలతో ప్రతియేటా కల్యాణం నిర్వహిస్తున్నారు. టీటీడీలో విలీనం అయిన తరువాత అభివృద్ధి బాగా జరుగుతోంది. ఇలాంటి తరుణంలో ఒంటిమిట్ట రాములోరు కడపలో ఉండడం ఒక ఆస్తిలాంటిది. గర్వకారణం. కడపలోనే కొనసాగించాలి.

- వెంకటరెడ్డి, ఏపీహెచ్‌బీ కాలనీ రామాలయం ధర్మకర్త

మార్చడం సబబు కాదు



సిద్దవటం, ఒంటిమిట్టలను అన్నమయ్య పరిధిలోకి తీసుకరావడం జిల్లావాసులను ఆశ్చర్యానికి గురిచేసింది. సిద్దవటం కడప జిల్లా కేంద్రంగా భాసిల్లింది. కాలక్రమంలో కడప జిల్లాకేంద్రంగా మారింది. కడప పట్టణం దగ్గరగా ఉంది. ఒంటిమిట్ట కూడా కడప సమీపంలో ఉంది. ప్రజలకు సౌకర్యంగా ఉంది. ఇలాంటప్పుడు మార్చడం సబబుగా లేదు.

- జానమద్ది విజయభాస్కర్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు

వీరభద్రాలయంలో సుబ్రహ్మణ్య షష్టి పూజలు



విశేష అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

రాయచోటిటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో వెలిసిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో బుధవారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి సందర్భంగా షణ్ముఖేశ్వరుని ఆలయంలో విశేష పూజలు చేశారు. విశేష అలంకరణలో దర్శనమిచ్చిన సుబ్రహ్మణేశ్వర స్వామిని పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా అభిషేకంలో పాల్గొన్న భక్తులకు ఆలయ అర్చకులు సుబ్రమణ్యషష్టి విశిష్టతను వివరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రతి పౌరుడు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలి

- జిల్లా ప్రధాన జడ్జి యామిని



న్యాయసేవాసదన్‌లో రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా ప్రధాన జడ్జి యామిని, వివిధ కోర్టుల జడ్జిలు

కడప రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి పౌరుడు రాజ్యాంగం ఉద్దేశం, ప్రాముఖ్యతను తెలుసుకుని అందుకు అనుగుణంగా నడుచుకోవాలని డీఎల్‌ఎస్‌ఏ చైర్ పర్సన్, జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ సి.యామిని పేర్కొన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన జడ్జి మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని 1949 నవంబరు 26న రాజ్యాంగ సభ ఆమోదించిందన్నారు. 1950 జనవరి 26న అమలులోకి వచ్చిందన్నారు. పౌరుల ఆకాంక్షలకు, సమాజంలోని మార్పులకు అనుగుణంగా ఉండాలని భావించి భారత రాజ్యాంగం రూపొందించారన్నారు. భారత రాజ్యాంగంలోని పీఠిక, ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక బాధ్యతలు ప్రజలకు కవచం లాంటివన్నారు. అలాగే కడప నగరంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో రాజ్యాంగం దినోత్సవం సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సును సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ నిర్వహించారు. కార్యక్రమాలలో మూడవ, నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తులు ఎస్.ప్రవీణ్‌కుమార్, దీనబాబు, ఆయా కోర్టుల జడ్జిలు, ప్యానల్ న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం భారతీయుల ఆత్మ : ఎస్పీ



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప క్రైం / కలెక్టరేట్ / రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మన రాజ్యాంగం కేవలం గ్రంథం కాదని.. కోట్లాది మంది భారతీయుల ఆత్మ అని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ అన్నారు. 76వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఎస్పీ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యాలయ అధికారులు, సిబ్బందితో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. అమూల్యమైన రాజ్యాంగం కల్పించిన హక్కులను ఆస్వాదించే ప్రతి ఒక్కరూ బాధ్యతలను గుర్తెరిగి వ్యవహరించాలని, నవ సమాజం, సమ సమాజం కోసం పాటుపడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు కె.ప్రకాశ్‌బాబు, బి.రమణయ్య, ఆర్‌ఐ శ్రీశైలరెడ్డి, డీపీవో ఏవో కేవీ రమణ, సూపరింటెండెంట్ శ్రీనివాసనాయక్, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లోని డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పీజీఆర్‌ఎస్ హాలులో అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ వెంకటపతి, ఏవో విజయకుమార్, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో రాజ్యాంగ దినోత్సవం వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించి మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు జడ్పీ సీఈవో ఓబులమ్మ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు రాజ్యాంగం దిశనిర్దేశం చేస్తోందన్నారు.

జనార్దన్‌రావే నిధులు సమకూర్చాడు

- విచారణలో వెల్లడించిన కట్టా రాజు, బాలాజీ
- ముగిసిన కస్టడీ.. జైలుకు తరలింపు

6

ఆ.. అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దయ్యేనా...?

- న్యాయం చేయాలంటూ బాధితుల ఫిర్యాదు
- చర్యలు తీసుకుంటామన్న డీఐజీ

6

ఎంపీ సీఎం రమేశ్‌కు మాతృవియోగం

- నేడు పోట్లదుర్తిలో అంత్యక్రియలు





ఎంపీ సీఎం రమేశ్ మాతృమూర్తికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

ఎర్రగుంట్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ మాతృమూర్తి చింతకుంట రత్నమ్మ(83) బుధవారం తెల్లవారుజామున స్వగ్రామం పోట్లదుర్తిలోని స్వగృహంలో స్వర్గస్తులయ్యారు. ఈ విషయం తెలుసుకున్న అనేకమంది ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు, అధికారులు, ప్రజలు పెద్దఎత్తున పోట్లదుర్తికి వచ్చి చింతకుంట రత్నమ్మ భౌతికకాయాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. ఎంపీ సీఎం రమేశ్‌ను పరామర్శించారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు బీటెక్ రవి, దేవగుడి నారాయణరెడ్డి, బచ్చల పుల్లయ్య, జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేశ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి, బీజేపీ నాయకులు శశిభూషణ్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, ఈవీ సుధాకర్‌రెడ్డి, శకుంతలమ్మ, మాజీ ఎంపీటీసీ నాగమణి, మాజీ సర్పంచు వెంకటరంగయ్య, కుంచం వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. గురువారం ఉదయం 11గంటలకు పోట్లదుర్తిలోని పెన్నానది తీరాన చింతకుంట రత్నమ్మ భౌతిక కాయానికి అంత్యక్రియలు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి హోంమంత్రి అనిత, ఇతర మంత్రులు, వ్యాపారవేత్తలు, వీఐపీలు రానుండటంతో జమ్మలమడుగు డీఎస్పీ వేంకటేశ్వరరావు, ఎర్రగుంట్ల సీఐ విశ్వనాథరెడ్డి ఎంపీ సీఎం రమేశ్‌తో మాట్లాడి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.



సీఎం రమేశ్‌తో మాట్లాడుతున్న నంద్యాల కొండారెడ్డి తదితరులు

అయ్యోౌరు..!



- మూడునెలలుగా గెస్ట్ లెక్చరర్లకు అందని జీతాలు
- ఆర్థిక ఇబ్బందుల్లో గురుకులాల సిబ్బంది

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందితో పాటు గెస్ట్ లెక్చరర్లు వేతనాల కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. వీరికి ప్రభుత్వం మూడు నెలల నుంచి జీతాలు చెల్లించకపోవడంతో ఆర్థికం గా ఇబ్బందులు పడుతు న్నారు. జీతాలు చెల్లిం చాలంటూ జిల్లా, రాష్ట్ర ఎస్సీ గురుకుల కార్యా లయాల చుట్టూ తిరిగినప్పటికీ ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలోని 24 పాఠశాలలు, కళాశాలల్లో సుమారు 280 మంది గెస్ట్ ఉపాధ్యా యులుగా పనిచేస్తున్నారు. వీరందరూ మూడు నెలల నుంచి జీతాలు రాక సతమతమవుతున్నారు. రెగ్యులర్ ఉద్యోగులకు ప్రతినెలా మొదటి వారంలో ఇస్తున్నారు కానీ పార్ట్ టైం టీచర్స్‌కు మాత్రం ప్రతి సంవత్సరం ఉండే బడ్జెట్ హెడ్‌లో కాకుండా జీతాలు రాని హెడ్‌నకు మార్పు చేశారని అంటున్నారు. దీంతో మూడు నెలల నుంచి బడ్జెట్ లేదని, అధికారుల నిర్లక్ష్య ధోరణితో ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా చేస్తున్నారని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పేరుకే పార్ట్‌టైం టీచర్స్‌గా ఉన్నా ప్రతి సంవత్సరం పదోతరగతి, ఇంటర్‌లలో విద్యార్థులతో మంచి ఫలితాలు సాధించడంలో కీలకపాత్ర పోషిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించి, వేతనాలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ప్రభుత్వం దృష్టి సారించాలి

గురుకులాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. యువగళం సమయంలో, ప్రచార సభల్లో తమ సమస్యలను చంద్రబాబు, లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ టీచర్లు, సిబ్బంది జీతాలు పెంచుతామని హామీ ఇచ్చారు. దానికి అనుగుణంగా సిబ్బందికి రూ.24వేలు, మెస్ వర్కర్లకు రూ.10 నుంచి రూ.15 వేల వరకు చెల్లిస్తున్నారు. అయితే ఈ వేతనాలు నెలనెలా అందకపోవడంతో సిబ్బంది ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నారు. విద్యార్థులకు చదువు చెప్పడం, ప్రత్యేక క్లాసులు తీసుకోవడం వారికి బాగా లేకుంటే దగ్గరుండి తీసుకెళ్లి వారి తల్లిదండ్రులకు అప్పగించడం లాంటి పనులు కూడా చేయాల్సి ఉంది. ఉదయం 7.45 నుంచి రాత్రి 9గంటల వరకు గురుకుల పాఠశాలల్లోనే విధులు నిర్వహిస్తుంటారు. అయినప్పటికీ మూడు నెలల వేతనాలు పెండింగు పడడంతో జిల్లా అధికారులు, మంత్రులు కార్యదర్శులకు వినతిపత్రాలు సమర్పిస్తూ వస్తున్నారు. కానీ సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. అధికారుల వద్దకు వెళితే బిల్లులు పడలేదంటున్నారు. సాంకేతిక సమస్య కారణంగానే వేతనాలు పడడంలేదని చెబుతున్నట్లు వారు వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతనాలు విడుదల చేయాలని కోరుతున్నారు.

సాంకేతిక కారణాలతో ఆలస్యం



కొన్ని సాంకేతిక కారణాల వల్ల వేతనాలు పెండింగు పడింది వాస్తవమే. అందరికీ వేతనాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఒకటి రెండు రోజుల్లో వేతనాలు అందించనున్నాం.

- ఉదయశ్రీ, జిల్లా కోఆర్డినేటర్, గురుకుల విద్యాలయాలు

విద్యార్థులకు రవాణా భత్యం

● ప్రభుత్వ బడుల్లో హాజరు పెంచడమే లక్ష్యం


● 3039 మంది విద్యార్థులకు రూ.91.17 లక్షలు విడుదల

రాయచోటి (నేతాజీ సర్కిల్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ బడుల్లో చదివే పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థుల రవాణా సౌలభ్యం కోసం ప్రభుత్వం 3039 మంది విద్యార్థులకు రూ.91.17 లక్షలు తొలి విడత సోమవారం విడుదల చేసింది. ఈ నిధులు విద్యార్థుల తల్లుల ఖాతాకు జమ అవుతాయి. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నిరంతరం చదువుకు ఈ పథకం ఎంతో దోహదపడుతుంది. గ్రామీణ ప్రాంత వెనుకబడిన, కుటుంబాల విద్యార్థుల ఆర్థిక పరిస్థితుల కారణంగా బడులకు దూరంగా ఉండేవారు. డ్రాపౌట్స్‌ను తిరిగి బడుల్లో చేర్పించేలా, ప్రభుత్వ బడుల్లో హాజరును పెంచేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. దీంతో విద్యార్థులకు రవాణా ఖర్చులు తగ్గి నిరంతరం చదువుకునేందుకు కూటమి ప్రభుత్వం చక్కటి అవకాశాన్ని కల్పించింది. తల్లికి వందనం, ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ ఇలా ప్రతి ఒక్కటి కల్పిస్తూ విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎన్నో పథకాలను తీసుకువస్తోంది.



ఆటోలో పాఠశాలకు వస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నారు




విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సూచనలు, సలహాలతో విద్యా వ్యవస్థలో సూచనలు, సలహాలతో విద్యా వ్యవస్థలో నూతన మార్పులను తీసుకొచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు చదువు కోసం తల్లికి వందనం, రవాణా సౌకర్యాలను నిధులు కేటాయింపు వంటి పథకాలతో ప్రోత్సహిస్తున్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా పేద విద్యార్థులకు విద్యను అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. పేద విద్యార్థులు ఇలాంటి పథకాలను సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకొని భవిష్యత్తులో వారి ఆశయాలను నేరవేర్చుకోవాలి.

- నల్లమల రామాంజులు, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా సభ్యుడు, రాయచోటి

రవాణా భత్యం... నిబంధనలు

గ్రామీణ ప్రాంతంలో పేద, వెనుకబడిన విద్యార్థులై ఉండాలి. 5వ తరగతి లోపు విద్యార్థులు ఒక కిలోమీటర్ పరిధిలో ఉన్న వారికి వర్తిస్తుంది. 6, 7, 8వ తరగతి విద్యార్థులకు 3 కిలోమీటర్ల లోపు ఉన్న వారికి వర్తిస్తుంది. 9, 10 విద్యార్థులు 5 కిలోమీటర్ల లోపు ఉన్న వారికి వర్తిస్తుంది. అయితే వారికి విధించిన కిలోమీటర్ల పరిధిలో మధ్యలో ప్రభుత్వ బడి ఉండరాదు. ఈ నిబంధనల ప్రకారం ఒక విద్యార్థికి 6 వేల రూపాయలు రవాణా భత్యం కింద మంజూరు చేసింది.

తొలి విడతలో జిల్లాలో 3039 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 3 వేల రూపాయలు చొప్పున వారి తల్లుల ఖాతాకు జమ చేశారు. పాఠశాలకు విద్యార్థులు స్థానిక ఆటోల సహకారంతో పాఠశాలకు వస్తున్నారు. ప్రభుత్వ బడులను నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో ఉత్తమ బోధనలను అందిస్తూ విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తున్నారు. సంబేపల్లె మండలంలో సుమారు 18 పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఈ పథకం వర్తిస్తుంది. ప్రాథమిక పాఠశాలలతో పాటు హైస్కూల్ చదివే విద్యార్థులు ఈ సౌకర్యాన్ని పొందుతున్నారు.



సంబేపల్లె మండలం వళ్లంగడ్డ పాపన్నగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు

ప్రభుత్వ బడుల బలోపేతం



గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపే విద్యార్థులు ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న ఉత్తమ విద్యా బోధన వివిధ సంక్షేమ పథకాలతో ప్రభుత్వ బడుల వైపు ఆకర్షితులవుతున్నారు. ప్రతి తరగతిలో హాజరు సంఖ్య పెరిగింది. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను పొందడం ప్రభుత్వ పాఠశాలలకే సాధ్యం.

- కొండూరు మురళీమోహన్‌రాజు, ఉపాధ్యాయుడు, రాయచోటి

పారదర్శకంగా నిర్వహించాలి

రైతన్నా.. మీకోసంలో సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి



మేకలవాండ్లపల్లెలో రైతులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

మదనపల్లె టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి సూచించారు. బుధవారం మదనపల్లె మండలం మేకలవాండ్లపల్లె నిర్వహిస్తున్న రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని సబ్‌కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ రైతులు సర్వసాధారణంగా మెట్టభూముల్లో వేసే వరి పంటకు బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలన్నారు. ఉద్యాన పంటల సాటుకు తప్పనిసరిగా డ్రిప్ విధానంతో నీటిని అందించాలన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రీయ ఎరువులను ఉపయోగించాలన్నారు. ఒక్కోసారి పంటలకు గిట్టుబాటు ధరలు రావడం లేదని రైతులు సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకురాగా... రైతులే ఎఫ్‌పీవోలను ఏర్పాటు చేసుకుంటే వాటిని ప్రోత్సహిస్తామని రైతుల వద్దకే వ్యాపారులు వచ్చి పంట కొనుగోలు చేసేలా రైతులకు గిట్టుబాటు ధరలు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. మిగిలిన మూడు రోజుల్లో రైతన్నా మీకోసం కార్యక్రమ లక్ష్యాలను చేరుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నవీన్‌కుమార్, వీహెచ్‌ఏ, రైతులు పాల్గొన్నారు.

వరి పంటపై అడవి పందుల దాడి



పందులు ధ్వంసం చేసిన పంటను చూపుతున్న రైతు

సుండుపల్లె, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కోతకు వచ్చిన వరి పొలాల్లో అడవి పందులు దాడి చేసి తీవ్రంగా నష్టపరిచాయని రైతు రామాంజుల్‌రెడ్డి తె లిపారు. మండలంలోని భాగంపల్లి సమీపంలో తాను సాగు చేసిన రెండు ఎకరాల వరి పొలంలో మంగళవారం రాత్రి అడవి పందులు దాడి చేసి నష్టపరిచాయని తెలిపారు. పంట సాగుకు రూ.60 వేలు ఖర్చు చేశానని, వారం రోజుల్లో కోయాల్సి ఉండగా 70 శాతం పంటను పందులు నాశనం చేశాయని, ప్రభుత్వమే తనను ఆదుకోవాలని కోరారు.

'రైతన్నా.. మీకోసం' సబ్‌కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



రైతన్నా..మీకోసం కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ భావన

నందలూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆడపూరు గ్రామంలో జరుగుతున్న రైతన్నా... మీకోసం కార్యక్రమాన్ని రాజంపేట సబ్‌కలెక్టర్ ఎస్.భావన బుదవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆమె కార్యక్రమం జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులు ఏయే పంటలు సాగు చేస్తున్నారు, దాంట్లో ఎలాంటి మద్దతు ధర లభిస్తుంది అనే విషయాల గురించి రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్, మండల వ్యవసాయాధికారి మల్లికార్జున, మార్కెట్‌యార్డు డైరెక్టర్ సుబ్బయ్య, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉందాం... వైసీపీకి మన సత్తా చూపుదాం

● ఆర్టీసీ రీజనల్ చైర్మన్, ప్రత్యేక పరిశీలకుడు నాగరాజు

ములకలచెరువు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులందరూ ఐక్యంగా ఉండి... వైసీపీకి మన సత్తా చూపుదామని ఆర్టీసీ రీజనల్ చైర్మన్, నియోజకవర్గ ప్రత్యేక పరిశీలకుడు పూల నాగరాజు, నియోజకవర్గ పరిశీలకుడు దినేశ్‌రెడ్డిలు అన్నారు. స్థానిక కేజీఎన్ కల్యాణమండపంలో బుధవారం జరిగిన మండల టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా ఉండి పార్టీని బలోపేతం చేయాలన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికల్లో కూటమి గెలిచే విధంగా కష్టపడి పనిచేయాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ యువ నేత కట్టా దొరస్వామినాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, సింగిల్ విండో అధ్యక్షుడు గుత్తికొండ త్యాగరాజు, మండల పరిశీలకుడు రెడ్డిశేఖర్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టిబాబు, నేతలు ఎర్రగుడి సురేష్, కేవీ రమణ, చెన్నకిష్టా, వెంకటస్వామి, ముత్తుకూరు మౌళా, సుధాకర్‌నాయుడు, మూగి రవిచంద్ర, నాగరాజుయాద్ తదితరులు పాల్గొన్నారు.



ములకలచెరువులో మాట్లాడుతున్న ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్, ప్రత్యేక పరిశీలకుడు పూల నాగరాజు

కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం

పెద్దతిప్పసముద్రం నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందని తంబళ్లపల్లె నియోజకవర్గ పరిశీలకుడు పోలంరెడ్డి దినేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం కుమ్మరవాండ్లపల్లె సమీపంలోని విజయగణపతి కల్యాణ మండపంలో టీడీపీ మండల కమిటీ ఎన్నిక ప్రక్రియ సమావేశంలో ఆయన మాట్లాడారు. టి.సదుం పంచాయతీలో టీడీపీకి ఎదురులేని మెజారిటీ కోసం అలుపెరుగని కృషి చేసిన ములకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీనాథ్‌రెడ్డిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మండలంలోని వివిధ గ్రామాల టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అరటి రైతులు అధైర్య పడవద్దు

జిల్లా ఉద్యాన అధికారి సుభాషిణి



పంటలను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి సుభాషిణి

రాజంపేట టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాబోవు రోజుల్లో అరటి సాగు చేసిన రైతులు లాభాలు కళ్లజూస్తారని, ఆర్థిక సమస్యలు తొలగుతాయని, అంతవరకూ రైతులు అధైర్యానికి లోనుకావద్దని జిల్లా ఉద్యాన అధికారి సుభాషిణి తెళిపారు. బుధవారం ఆమె రాజంపేట మండలంలోని వరదయ్యగారిపల్లె, పుల్లంపేట మండలంలోని బావికాడపల్లెలో అరటి తోటలను పరిశీలించారు. ప్రస్తుతం 300 నుంచి 500 ఎకరాల్లో పంట 15 రోజుల్లో కోత దశకు చేరుతుందన్నారు. డిసెంబరులో కడప, అన్నమయ్య, అనంతపురం, నంద్యాల జిల్లాల ఉద్యాన అధికారులు అరటిపంట ఎగుమతిదారులతో చర్చలు జరిపి అరటికి సరైన ధర లభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రాజంపేట ఉద్యాన అధికారి సునీల్, రైల్వేకోడూరు ఉద్యాన అదికారి భాస్కర్, చిట్వేలి ఉద్యాన అదికారి లోకేష్, ఉద్యాన సహాయకులు విష్ణురెడ్డి, ప్రవీణ్, ఉద్యాన రైతులు పాల్గొన్నారు.

అయోమయానికి గురి చేస్తున్నారు : తులసిరెడ్డి

రాజంపేట టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాల పునర్వ్యవస్థీకరణ పేరుతో కూటమి ప్రభుత్వం అన్నమయ్య జిల్లా ప్రజలను అయోమయానికి గురి చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి ఆరోపించారు. బుధవారం పట్టణంలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా నుంచి మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె, నియోజకవర్గాలను విడగొట్టి మదనపల్లె జిల్లాలో చేర్చారన్నారు. ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలో రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి నియోజకవర్గాలు మాత్రమే ఉంటాయని, వీటితోనే అన్నమయ్య జిల్లాను కొనసాగిస్తారా.. లేక వేరే నియోజకవర్గాలు కలుపుతారా అన్నదానిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూల భాస్కర్, రాజంపేట పట్టణ కమిటీ అధ్యక్షుడు నరేశ్, రాజంపేట మండల శాఖల అధ్యక్షులు మహదేవయ్య, శివ, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

జనార్దన్‌రావే నిధులు సమకూర్చాడు

● విచారణలో వెల్లడించిన కట్టా రాజు, బాలాజీ

ములకలచెరువు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ వ్యవహారంలో ప్రధాన నిందితుడు జనార్దన్‌రావు కీలకమని, నకిలీ మద్యం తయారికి మొత్తం పెట్టుబడి ఆయనే పెట్టాడని కీలక నిందితులు కట్టా రాజు, బాలాజీలు విచారణలో వెల్లడించినట్లు తెలిసింది. ములకలచెరువు నకిలీ మద్యం కేసులో నిందితులైన కట్టా రాజు, కొడాలి శ్రీనివాసరావు, బాలాజీ, సుదర్శన్, డ్రైవర్ ఆష్రఫ్, చైతన్యబాబులను మూడు రోజుల పాటు కస్టడీకి ఇస్తూ తంబళ్లపల్లె కోర్టు ఈనెల 24వ తేదీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో బుధవారం నాటితో కస్టడీ ముగిసింది. నిందితులను మూడు రోజుల పాటు విచారించిన ఎక్సైజ్ పోలీసులు కీలక విషయాలు రాబట్టారు. నిందితులను కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి విచారించారు. నకిలీ మద్యం తయారికి సంబంధించి అంశాలు, ఆర్థిక లావాదేవిలు, బెల్ట్‌షాపులకు సరఫరా, బెల్ట్‌షాపుల నుంచి నగదు వసూళ్ళ, స్పిరిట్ సరఫరా, పాత్ర, సూత్రధారుల గురించి కట్టా రాజు, బాలాజీలను ప్రశ్నించి సమాచారాన్ని రాబట్టారు. కస్టడీ సమయం ముగియడంతో ఐదుగురు నిందితులను వైద్య పరీక్షల అనంతరం మదనపల్లె సబ్‌జైలుకు, కట్టా రాజును నెల్లూరు సెంట్రల్ జైలుకు తీసుకెళ్లారు.



తంబళ్లపల్లె ప్రభుత్వాస్పత్రిలో నిందితులు

జనార్దన్‌రావు.. పీటీ వారెంట్‌కు అనుమతి

ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లె జనార్దన్‌రావును ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లె కోర్టులో హాజరుపరచనున్నారు. ఇబ్రహీంపట్నం కేసులో అరెస్టయి నెల్లూరు జైలులో ఉన్న జనార్దన్‌రావు, అతడి తమ్ముడు జగన్‌మోహన్‌రావు, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, రమేశ్‌బాబు, అల్లాబక్షులను ములకలచెరువు కేసులో అరెస్టు చూపేందుకు అనుమతి ఇవ్వాలని ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లె కోర్టులో పీటీ వారెంట్ దాఖలు చేశారు. దీంతో ఐదుగురిని ఈనెల 30వ తేదీలోగా హాజరుపరచాలని కోర్టు ఆదేశించింది. దీంతో అద్దేపల్లి జనార్ధన్‌రావుతో పాటు ఐదుగురు నిందితులను నెల్లూరు జైలు నుంచి తంబళ్లపల్లె కోర్టుకు తీసుకురానున్నారు.

ఎఫ్‌పీవోల ద్వారా మార్కెటింగ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ మాస్ సీఈవో సీఎస్ రెడ్డి

పీలేరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మామిడి పంటను రైతు ఉత్పత్తిదారుల సంఘాల(ఎఫ్‌పీఓలు) ద్వారా మార్కెటింగ్ చేసుకోవాలని పీలేరులోని ఏపీ మాస్ సంస్థ సీఈవో సీఎస్ రెడ్డి రైతులకు సూచించారు. వచ్చే సీజన్‌లో మామిడి మార్కెటింగ్‌కు అవలంబించాల్సిన పద్ధతులపై బుధవారం పీలేరు ఏఎంసీ ప్రాంగణంలో రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తమ ఉత్పత్తులకు మెరుగైన ధరలు రావడానికి రైతులు సంస్థాగతంగా, శాస్త్రీయంగా, సమన్వయంగా పనిచేయాలన్నారు. పీలేరు ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి మాట్లాడుతూ వచ్చే సీజన్‌లో మార్కెట్ కమిటీ ఆవరణలోనే రైతులకు అన్ని సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం రైతులు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఏపీ మాస్ మేనేజర్ డాక్టర్ భార్గవి, ఏఎంసీ సభ్యులు కలప రవి, గోళ్ల కిశోర్ నాయుడు, రహంతుల్లా, ఏపీ మాస్ పాలకవర్గ సభ్యులు సహదేవరెడ్డి, బోదేషావలి, తదితరులు పాల్గొన్నారు.

పురాతన ఆలయాల అభివృద్ధికి చర్యలు

గాలివీడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పురాతన ఆలయాల అభివృద్ధికి దేవదాయ, ధర్మదాయ(శాఖ చర్యలు తీసుకుంటుందని ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శివయ్య తెలిపారు. బుధవారం నూలివీడు దేవరకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, అరవీడు దొనకొండ గంగమ్మ దేవాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన దేవాలయాలను రిజిస్ట్రేషన్, పబ్లికేషన్ చేసేందుకు దేవదాయ శాఖ సత్వర చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం ఆయన మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో పురాతన ఆలయాలను పరిశీలించి ఆలయాల స్థితిగతులను, అర్చకులు, గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్ర స్వ్కాయ్ పోటీల్లో బంగారు పతకం



మజహర్ అలీని అభినందిస్తున్న దృశ్యం

మదనపల్లె టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్వ్కాయ్ పోటీల్లో మదనపల్లె వాసి మజహర్ అలీ బంగారు పతకం సాధించాడని శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 24, 25 తేదీల్లో నంద్యాలలో నిర్వహించిన 8వ రాష్ట్ర స్థాయి స్వ్కాయ్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థి మజహర్ అలీ పాల్గొన్నాడన్నారు. ఈ పోటీల్లో అద్భుత ప్రతిభ కనపరచి బంగారు పతకం సాధించాడన్నారు. ప్రిన్సిపాల్ రమాదేవి, పీడీలు శరత్, జగదీష్ అభినందించారు.

ఆ.. అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దయ్యేనా...?

● మాకు న్యాయం చేయాలంటూ బాధితుల ఫిర్యాదు

● చర్యలు తీసుకుంటామన్న డీఐజీ హామీపై ఆశలు

బి.కొత్తకోట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన తప్పుడు రిజిస్ట్రేషన్‌లు రద్దు అవుతాయా? బాధితులకు న్యాయం జరుగుతుందా? అక్రమాలకు పాల్పడిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటారా? ప్రస్తుతం బి.కొత్తకోట ప్రజలకు, అధికారులకు నివృత్తికాని అనుమానాలివి. న్యాయపరంగా తమకు హక్కు ఉన్న భూములను బి.కొత్తకోట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇతరుల పేరున అక్రమంగా రిజిస్టర్ చేసేశారని, ఈ అన్యాయంపై ఎంత న్యాయపోరాటం చేసినా తమకు న్యాయం జరగలేదని పలువురు బాధితులు చేస్తున్న వాదన ఇంతకాలం అరణ్యరోదనగానే మిగిలింది. ఈనెల 24 రిజిస్ట్రేషన్స్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ (డీఐజీ) రామలక్ష్మీ పట్నాయక్ బి.కొత్తకోటకు చేరుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి, అక్రమాల ఆరోపణలపై విచారణ చేపట్టడం, బాధితుల ఆక్రందనలు వినడం, లిఖితపూర్వకంగా ఫిర్యాదులు స్వీకరించడం, వాటిపై సమగ్రంగా విచారించి న్యాయం చేస్తామని హామీ నివ్వడంతో ఆశలు చిగురించాయని ఫిర్యాదులు చేసిన బాధితులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

● బి.కొత్తకోట సబ్‌రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ మొత్తంలో 1 శాతం లంచంగా తీసుకుంటున్నారని, స్టాంప్‌రైటర్లు ఇష్టారాజ్యంగా కార్యాలయ సిబ్బందిని తమ చెప్పుచేతల్లో పెట్టుకొని, రైతుల సొమ్ము దోచుకుంటున్నారన్న ఫిర్యాదుల మేరకు విచారణకు వచ్చిన డీఐజీ రామలక్ష్మీపట్నాయక్‌కు విస్తుపోయే సాక్ష్యాలు, ఆధారాలు దొరికాయి. కార్యాలయ అవినీతిపై బహిరంగంగా జనం ఏకరువు పెట్టారు. చిన్నపాటి మొత్తాలే కాకుండా ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లు, వివాదాస్పద స్థలాల విషయంలో ఏకపక్ష నిర్ణయాలతో రిజిస్ట్రేషన్లు చేసినందుకు రూ.లక్షలు చేతులు మారినట్లు డీఐజీకి ఆరోపణలు వచ్చాయి. ఈ సందర్భంగా డాక్యుమెంట్ల జిరాక్స్‌లతో పాటు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు ఇవ్వాలన్న ఆమె ఆదేశాల మేరకు పలువురు అర్జీలు సమర్పించారు. వాటిలో కొన్ని...



డీఐజీ రామలక్ష్మీ పట్నాయక్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

● బి.కొత్తకోట మండలంలోని బీరంగి పంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు 865-1ఏలో 1.66 ఎకరాల భూమికి సంబంధించి తన తండ్రి వి.ప్రభాకర్‌రావు పేరున పట్టాదార్ పాస్‌బుక్, మాన్యువల్1బి, అడంగల్, అనుభవ సర్టిఫికెట్, సబ్ డివిజన్ స్కెచ్, ఆర్‌హెచ్ నకలు ఉన్నాయని, తన తండ్రి 2012లో చనిపోతే 2013లో శ్రీనివాసులు, మరో ఇద్దరు చేరి ఈ భూమిని ఇతరులకు రిజిస్టర్ చేసిచ్చారని ఇది అక్రమం అని బి.కొత్తకోటకు చెందిన వి.మంజునాథ్ ఫిర్యాదు చేశారు.

● బి.కొత్తకోట మండలం గ్రామలెక్క దాఖలా సర్వే నెంబరు-309ఏ, తమకు రిజిస్టర్ డాక్యుమెంట్ ఉన్న భూమిని ఇతరుల పేరిట చేసిన రిజిస్ట్రేషన్ అక్రమమని, తమకు కోర్టు జడ్జిమెంట్, ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నా న్యాయం జరగలేదని, దానిని రద్దు పరచాలని బి.కొత్తకోట దర్గావీదికి చెందిన జేయస్ అస్లంబాషా డీఐజీకి పిర్యాదు చేశారు.

● బి.కొత్తకోట పట్టణంలోని సర్వే నెంబర్లు-337, 338, 339లలో విక్రయం ద్వారా డాక్యుమెంట్ నెంబరు-3186-1958 ప్రకారం తన తండ్రి బి.ఖాశిం సాబ్‌కు సంక్రమించిన భూమిని ఇతరులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, దానిని రద్దు పరచాలని పట్టణంలోని సింహం వీధికి చెందిన బి.సయ్యద్‌సాబ్ ఫిర్యాదులో పేర్కొన్నాడు.

కాగా ఇలాంటి ఫిర్యాదులతో పాటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తమ విచారణలో తేలిన అంశాలపై రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్‌కు నివేదిక సమర్పించారని తెలుస్తోంది. చర్యలు ఏ మేరకు ఉంటాయో ముందు తెలియనుంది.

కళాశాల భూమి కబ్జాపై ఫిర్యాదు

కలికిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలకు కేటాయించిన భూమిని కబ్జా చేశారని కళాశాల యాజమాన్యం బుధవారం తహసీల్దారుకు ఫిర్యాదు చేసింది. ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి తరఫున కళాశాల అధికారులు ఈ మేరకు తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. 2009లో ప్రభుత్వం ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల కోసం 49.18 ఎకరాలు కేటాయించారని, ఆ తరువాత అందులో నుంచి 7 ఎకరాలు సైనిక్ స్కూల్‌కు పోగా ఇటీవల జాతీయ రహదారి విస్తరణ కోసం మరో 4.4.6 ఎకరాలు తీసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందులో భాగంగా 598 సర్వే నెంబరులో ఉన్న 6.01 ఎకరాల్లో కొంతభాగం ఒక వ్యక్తి ఆక్రమించుకున్నాడని, దీనిపై కళాశాల సిబ్బంది ఆక్రమణదారుడిని అడ్డుకునేందుకు ప్రయత్నించినట్లు వివరించారు. సర్వే నెంబరు-598కి బదులు రీసర్వేలో కేటాయించిన ఎల్‌పీఎం నెంబర్లు తప్పులతడకగా ఉన్నాయని, వాటిని సరిదిద్ది ఒరిజినల్ ఎల్‌పీఎం 2600ను సబ్ డివిజన్ చేయించాలని కోరారు. దీనిపై విచారణ చేసి ఆక్రమిత భూమిని గుర్తించి నివేదించాల్సిందిగా మండల సర్వేయర్‌ను తహసీల్దారు ఆదేశించారు. అనధికారిక సమాచారం మేరకు కళాశాలకు కేటాయించిన భూమిలో ఒక ఎకరాను కబ్జా చేసి విక్రయాలు కూడా జరిపారని చెబుతున్నారు. దీనికోసం మూడేళ్ల కిందట రెవెన్యూ అధికారులే రికార్డులను తారుమారు చేసి కబ్జాదారుడి పేరుతో భూమి బదలాయించినట్లు సమాచారం. ప్రస్తుత అధికారులు మొత్తం వ్యవహారంపై కూపీ లాగుతున్నట్లు చెబుతున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్

వల్లూరు/కమలాపురం రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అన్నదాతల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పంచ సూత్రాలు, సాగు విధానంలో తీసుకువస్తున్న వినూత్న మార్పులపై రైతులకు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా వ్యవసాయధికారి చంద్రనాయక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు శ్రేయస్సు కోసం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా మూడో రోజు బుధవారం జిల్లాలోని వల్లూరు మండలం తోళ్లగంగన పల్లెలో రైతుల ఇంటికి వెళ్లి రైతు సంక్షేమ కార్యక్రమాలపై రాష్ట్రప్రభుత్వం ప్రచురించిన కరపత్రాలను ఆయన రైతులకు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల కోసం అనేక రైతు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. రైతన్న మీకోసం కార్యక్రమం ద్వారా 3వ రోజుకు చేరకుందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 1,20, 932 మంది రైతు కుటుంబాలను సందర్శించడం జరగిందన్నారు. అన్నదాత సుఖీభవ, సబ్సిడీ విత్తనాల పంపిణీ తదితర అంశాలతో పాటు ప్రస్తుత రబీ సీజన్‌లో ఎదురయ్యే సవాళ్లను ఎలా ఎదుర్కోవాలన్న అంశాలపై రైతులతో చర్చించారు. నర్సరీల ఏర్పాటు, సబ్సిడీలు, మైక్రో ఇరిగేషన్ పథకాలు కోల్డ్ స్టోరేజీ ఏర్పాటుకు సహకారం వంటి చర్యలతో ఉద్యానవన శాఖ రైతులకు అండగా నిలుస్తుందన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ఉద్యానపంటలకు ఉన్న భారీ డిమాండ్లను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎగుమ తుల అవకాశాలను కూడా అందిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఇందులో భాగంగా పంచ సూత్రాల ద్వారా రైతులకు మేలు చేసే కార్యక్రమాలపై ఈనెల 29 వరకు ప్రతి రైతు ఇంటికి అధికారులు, ప్రజాప్రతి నిధులు వచ్చి రైతులకు అవగాహన పెంచుతారన్నారు. రైతు సేవాకేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అనుబంధశాఖల అధికారులు పాల్గన్నారు.

సబ్సిడీతో డ్రిప్ పరికరాలు

ఏపీఎంఐపీ స్కీం ద్వారా ఎస్సీ ఎస్టీ రైతులకు డ్రిప్ పరికరాలను వంద శాతం సబ్సిడీతో, మిగతా రైతులకు 90 శాతంతో డ్రిప్ పరికరాలను అందిస్తున్నామని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. బుధవారం కమలాపురం మండల పరిధిలోని నల్లింగాయపల్లెలో నిర్వహిస్తున్న రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రసాయనిక మందులు, ఎరు వులను తగ్గించి వాడాలన్నారు. కార్యక్రమంలో వల్లూరు మండల వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్ రెడ్డి, కమలాపురం గ్రామ వ్యవసాయ సహాయకురాలు ఆకిషా, రైతుసేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పంచ సూత్రాల అమలుతో రైతుల ఆర్థికాభివృద్ధి

● జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్



రైతన్నా మీ కోసం కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటిటౌన్/నేతాజీసర్కిల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలోని పంచ సూత్రాల అమలుతో రైతుల ఆర్థికాభివృద్ధి సాధ్యమని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పంచ సూత్రాల అమలు, అవగాహన కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. రాయచోటి మండలం ఇందుకూరుపల్లిలో జరుగుతున్న పంచసూత్రాల అవగాహన కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతన్న మీకోసం కార్యక్రమంలో పంచ సూత్రాలపై అవగాహన, పాడి పశువుల పెంపకం, ఎరువుల వాడకాన్ని తగ్గించడం, తృణ ధాన్యాల వైపు రైతులను మళ్లించడంపై రైతులందరికీ అవగాహన కల్పిస్తున్నారన్నారు. అలాగే సంబేపల్లె మండలం మోటకట్లలో జరుగుతున్న పంచసూత్రాల అవగాహన కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ చేసి రైతులతో మాట్లాడారు. రైతుసేవ కేంద్రాల్లో ఎరువులు అందుతున్నాయా అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసా యశాఖ అధికారి శివనారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో రన్నర్స్‌గా కస్తూర్బా విద్యార్థినులు



జాతీయస్థాయిలో రాణించిన కస్తూర్బా విద్యార్థినులు

కలసపాడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కబడ్డీ పోటీల్లో జాతీయ స్థాయిలో తమ పాఠశాల విద్యార్థినులు రన్నర్స్‌గా నిలిచినట్లు పెండ్లిమర్రి కస్తూర్బా ప్రిన్సిపాల్ రెడ్డిజ్యోతి తెలిపారు. ఇటీవల జాతీయస్థాయి కబడ్డీ అండర్-19లో పోటీల్లో ప్రతిభ కనబరిచారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలకు గుర్తింపు తెచ్చిన విద్యార్థినులు కళ్యాణి, షఫియా, మంజుల, శృతి, మహేశ్వరి, సుమాంజలి, నిహారిక, కీర్తి, శిరీష, అమరావతి, కీర్తనలతో పాటు వ్యాయామ ఉపాధ్యాయురాలు వాణిలను ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

విజయవంతంగా ముగిసిన క్రీడాపోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ జి.రామచంద్రరావు, డాక్టర్ ఎం.మాధవ

పులివెందుల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పులివెందుల ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన అంతర్‌కళాశాలల క్రీడలు, ఆటలు, సాంస్కృతిక, సాహిత్య పోటీలు బుధవారం విజయవంతంగా ముగిశాయి. ఈసందర్భంగా పులివెందుల ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల డీన్ డాక్టర్ ఎం.మాధవ మాట్లాడుతూ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపి తమ కళాశాల, విశ్వవిద్యాలయ ప్రతిష్టను పెంచారన్నారు. అనంతరం విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో 19 కళాశాలల విద్యార్థులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని సమస్యలకు పరిష్కారం చూపే ఏకైక గ్రంథం రాజ్యాంగం



రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అన్ని సమస్యలకు పరిష్కారం చూపే ఏకైక గ్రంథం మన రాజ్యాంగం అని వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ తెలిపారు. బుధవారం యోగివేమన విశ్వవిద్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం-2025ను ఘనంగా నిర్వహించారు. వీసీ రాజశేఖర్, ప్రముఖ అధ్యాపకులు, అతిథులు అంబేడ్కర్ చిత్రపటం, విగ్రహానికి నివాళులు అర్పించారు.

అనంతరం జరిగిన సదస్సులో వీసీ మాట్లా డుతూ రాజ్యాంగం దేశానికి పవిత్ర గ్రంథమని, సమ స్యలన్నింటికీ రాజ్యాంగమే మార్గదర్శకమని పేర్కొన్నారు. విద్యార్థులు హక్కులతో పాటు బాధ్యతలు పాటించాలని సూచించారు. మాజీ డీఎస్ ప్రొఫెసర్ ఎం.చెన్నబసవయ్య రిజర్వేషన్ల తత్వం, రాజ్యాంగ అవగాహనపై విశ్లేషణాత్మక ఉపన్యాసం ఇచ్చారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ రాజ్యా ంగంలోని ముఖ్యాంశాలు వివరించగా, ప్రిన్సిపల్ టి.శ్రీని వాస్ రాజ్యాంగాన్ని గౌరవిస్తే దేశం 2050 నాటికి మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. డీన్లు రాజ్యాంగ చారిత్రక నేపథ్యం, అంబేడ్కర్ ఎదుర్కొన్న కష్టాలు, సమాజంలో ఇంకా కొనసాగుతున్న కుల అంతరాలపై మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. రాజ్యాంగ ప్రియాంబుల్ ప్రదర్శిస్తూ విద్యార్థుల ర్యాలీ నిర్వహించారు.

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన అవసరం




టీకాల నిలువ పద్ధతిని పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

సీకేదిన్నె, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలు వ్యాధినిరోధక టీకాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. స్థానిక భగత్‌సింగ్‌నగర్ పీహెచ్‌సీ పరిధిలోని మామిళ్లపల్లెలో ఆయుష్మాన్ ఆరోగ్య ఉపకేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా టీకాల కోసం అవసరమైన ఐస్‌ప్యాక్స్ సక్రమంగా కండీషన్‌లో ఉన్నాయా లేదా అని, టీకాల నిలువ పరిస్థితులు ఎలా ఉన్నాయో ఆరా తీశారు. వ్యాధినిరోధక టీకాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయా, ఎంతమందికి టీకాలు అందించారు వివరాలు అడిగి తెలుసుకున్నారు. తల్లి, శిశువు ఆరోగ్య సంరక్షణలో టీకాల పాత్రపై ఆరోగ్య సిబ్బంది వివరించాలన్నారు. ప్రజలకు వివరించడం ద్వారా వారి నుంచి పూర్తి సహకారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారులు రాఘవేంద్ర, సీహెచ్‌వో మునిరెడ్డి, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ కట్ చేసినందుకు కేసు నమోదు

కొండాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.కోడూరు వద్ద ఉన్న సోలార్ కంపెనీ కేబుల్ కట్ చేసినందుకు బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి అనే రైతు తన పొలాన్ని సోలార్ కంపెనీకి లీజుకు ఇచ్చాడు. దీనికి సంబంధించి లీజు ప్రకారం కంపెనీ డబ్బులు చెల్లించింది. కాగా ఈశ్వర్‌రెడ్డి తన పొలంలో సోలార్ కంపెనీ కేబుల్ వేస్తుండగా అడ్డుకున్నాడు. దీంతో ఆయన కంపెనీ ప్రతినిధులతో గొడవపడ్డాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ శివనాగిరెడ్డి తెలిపారు.


త్రుటిలో తప్పిన ప్రమాదం



బోల్తాపడిన లారీ

వీరపునాయునిపల్లె, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల-వీరపునాయునిపల్లె ప్రధాన రహదారిలోని పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న బ్రిడ్జి వద్ద బుధవారం తెల్లవారుజామున లోడుతో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తా పడింది. లారీలో ఉన్న డ్రైవర్ అదృష్ట వశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. బ్రిడ్జి వద్ద ఇరుపక్కల రక్షణగోడ లేక పోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని పలువురు భావిస్తున్నారు. కనీసం రేడియం స్టిక్కర్స్ ఉన్నా ప్రమాదం జరిగేది కాదంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇరువైపుల రక్షణగోడ నిర్మించాలని కోరుతున్నారు.

విద్యుత్ షాక్... ఆవు మృతి



పెండ్లిమర్రి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉలవలపల్లె గ్రామ పంట పొలాల్లో బుధవారం రైతు బాల గురవయ్యకు చెందిన ఆవు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందింది. విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను కింద ఏర్పాటు చేయడంతో షాక్‌కు గురై ఆవు మృతి చెందిందని బాధిత రైతు తెలిపారు. దాదాపు రూ.50వేలు నష్టం వాటిల్లిందన్నారు. సంఘటనా స్థలాన్ని విద్యుత్ ఏఈ, పశువైద్యాధికారి పరిశీలించారు.

ఆకట్టుకున్న స్కౌట్స్ విద్యార్థుల వేషధారణలు



వివిధ వేషధారణలలో స్కౌట్ విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్ర రాజధాని లక్నోలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ కార్యాలయం వారు 19వ నేషనల్ జాంబోరీ, డైమండ్ జూబ్లీ జాంబోరీను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిధిగా రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హాజరయ్యారు. రాష్ట్ర ఔన్నత్యాన్ని చాటి చెప్పే విధంగా శ్రీవెంకటేశ్వరస్వామి వేషధారణలో కడప జిల్లా స్కౌట్ మాస్టర్ జగదీష్, పద్మావతి అమ్మవారిగా సవిత్రశ్రీ, లక్ష్మీదేవి అమ్మవారి అవతారంలో సుమనశ్రీ, వీరబ్రహ్మేంద్రస్వామి వేషధారణలో వెంకటసుబ్బయ్య, సిద్దయ్య వేషధార ణలో అల్తాఫ్ జిల్లా గొప్పదనాన్ని, కీర్తిని దేశానికి చాటిచెప్పారు. కార్యక్రమంలో కడప జిల్లాకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్, రేంజర్స్ అండ్ రోవర్స్ వివిధ పాల్గొని జయప్రదం చేశారు.

సమర్థవంతమైన నాయకత్వం కోసం అభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న ఏఐసీసీ కోఆర్డినేటర్

కడప కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కాంగ్రెస్ పార్టీని సమర్థవంతంగా నడిపించేందుకు నాయకత్వం కోసం ఆసక్తి గల నేతల నుంచి దరఖాస్తులు, అభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు ఏఐసీసీ కో ఆర్డినేటర్, కన్యాకుమారి ఎంపీ విజయ వసంత్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంఘటన్ సుజన్ అభియాన్ కమిటీ జిల్లా పర్యటనలో భాగంగా డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతితో కలసి పాత్రికేయుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా విజయ్ వసంత్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ఏఐసీసీ ఆదేశాల మేరకు అన్ని జిల్లాల్లో ఎస్ఎస్ఏ కమిటీ పర్యటిస్తోందన్నారు. ఏఐసీసీ, పీసీసీతో పాటు జిల్లా నుంచి డీసీసీ అధ్యక్షులతో కూడిన ఐదుగురు బృందం పర్యటిస్తోందన్నారు. నియోజకవర్గాల వారీగా వచ్చే నెల 5వ తేదీ వరకు జిల్లా నాయకత్వం బలోపేతం చేసే ఆసక్తి ఉన్న నేతల నుంచి దరఖాస్తులతో పాటు అభిప్రాయ సేకరణ చేపట్టడం జరుగుతోందన్నారు. పార్టీ నాయకులు, అనుబంధ సంఘాలు, కార్యకర్తలు, ప్రజల అభీష్టం మేరకు జిల్లా నాయకత్వాన్ని ఎంపిక చేసేలా ఏఐసీసీ కమిటీకి సమర్పించిన దరఖాస్తులను పంపుతామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోట సత్యనారాయణ, రాష్ట్ర జనరల్ సెక్రటరీ నరసింహులు, లీగల్ సెల్ ఛైర్మన్ సోమశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యిద్ గౌస్‌పీర్, నియోజకవర్గాల కో ఆర్డినేటర్లు శివ మోహన్‌రెడ్డి, ధ్రువకుమార్, అశోక్‌రెడ్డి తదితర నేతలు పాల్గొన్నారు.

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు



ఆర్.ఎస్. క్రిష్ణసాయి



వర్మ

కడప స్పోర్ట్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య సాగుతున్న ఏసీఏ అండర్-14 ఇంటర్ జోనల్ రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు బుధవారం డ్రాగా ముగిశాయి. వివరాలిలా.. ఏసీఏ క్రికెట్ మైదానంలో నార్త్‌జోన్ విన్నర్స్- సౌత్‌జోన్ విన్నర్స్ మధ్య సాగుతున్న మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన నార్త్‌జోన్ విన్నర్స్ జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లకు 7 వికెట్లు కోల్పోయి 276 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. తదుపరి రెండవ రోజున బ్యాటింగ్‌కు దిగిన సౌత్‌జోన్ విన్నర్స్ జట్టు 78.4 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో ఎస్.ఎం. ఇజహర్ 50 పరుగులు, రక్షన్‌సాయి 50 పరుగులు చేశారు. దీంతో నార్త్‌జోన్ విన్నర్స్ జట్టుకు 65 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన నార్త్‌జోన్ విన్నర్స్ జట్టు ఆట ముగిసే సమయానికి 9 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 29 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్- రెస్ట్ ఆఫ్ సెంట్రల్‌జోన్ మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన రెస్టఆఫ్ నార్త్‌జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 75.4 ఓవర్లలో 286 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్టఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 12 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 66 పరుగులు చేసింది. తిరిగి రెండో రోజు బ్యాటింగ్ చేపట్టి 90 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 337 పరుగుల భారీ స్కోర్ సాధిం చింది. ఇందులో వర్మ 110, ఎం.లికిత్ 71 పరుగులు చేశారు. దీంతో రెస్టఆఫ్ సెంట్రల్‌జోన్‌కు 51 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. ఇదిలావుండగా రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ జట్టు బౌలర్ ఆర్.ఎస్.క్రిష్ణసాయికి 5 వికెట్లు లభించాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన రెస్టఆఫ్ నార్త్‌జోన్ జట్టు ఆట ముగిసే సమయానికి 18 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 112 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో రెస్టఆఫ్ సౌత్‌జోన్ విన్నర్స్- రెస్టఆఫ్ సెంట్రల్‌జోన్ విన్నర్స్ జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటిం గ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 66.5 ఓవర్లలో 224 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. ఇందుకు ప్రతిగా సెంట్రల్‌జోన్ విన్నర్స్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు 31 ఓవర్లలో 5 వికెట్లు కోల్పో యి 96 పరుగులు చేసింది. బుధవారం రెండో రోజు బ్యాటింగ్‌కు దిగి మొత్తం 51.5 ఓవర్లలో 147 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఇందులో తమన్‌సాయి 52 పరుగులు చేశారు. దీంతో రెస్టఆఫ్ సౌత్‌జోన్ జట్టుకు 77 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన రెస్టఆఫ్ సౌత్‌జోన్ జట్టు ఆట ముగిసే సమయానికి 62 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 177 పరుగులు చేసింది. ఇందులో కిన్నుకిశాల్ 77 పరుగులు చేయగా, సాయి క్రిష్ణచైతన్య 53 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

వంతెనను ప్రారంభించిన ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పుత్తాచైతన్యరెడ్డి

వీరపునాయునిపల్లె,నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తలపనూరు గ్రామంలో బుధవారం సాయంత్రం వంతెనను కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి ప్రారంభించారు. నాబార్డు నిధుల కింద రూ.30లక్షలతో నిర్మాణం పూర్తిచేశారు. మండల టీడీపీ కన్వీనర్ బైరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, తలపనూరు సర్పంచుశివకుమార్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, అలిదెన సర్పంచు ఓబులేసు, గండి ఓబయ్యయాదవ్, పాయసంపల్లె వాసుదేవరెడ్డి, ఉరుటూరు ఉపేంద్రరెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైవీ స్ట్రీట్‌లో ఫుట్ పెట్రోలింగ్



కడప క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్ పరిధిలోని వైవీ స్ట్రీట్‌లో సీఐ చిన్న పెద్దయ్య ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. రోడ్డును ఆక్రమించిన దుకాణదారులు, తోపుడుబండ్ల వారికి పలు సూచనలు చేసి వైవీ స్ట్రీట్‌కు వచ్చే ప్రజలకు ట్రాఫిక్ అడ్డంకులు లేకుండా సాఫీగా సాగేందుకు చర్యలు చేపట్టారు. అడ్డదిడ్డంగా వాహనాలు పార్కింగ్ చేస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

'దళితులకు రిజర్వేషన్లు లేకుండా చేయాలనే కుట్ర'

పులివెందుల రూరల్,నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ చేసి దళితులకు రిజర్వేషన్లు లేకుండాచేయాలనే కుట్ర దేశంలో కొనసాగుతోందని ఏపీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు ఆర్.కృష్ణమూర్తితో కలిసి పులివెందులలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

మరిచారేమో..?

- ●రూ.40లక్షలతో నిర్మించారు...ప్రారంభించలేదు
- ●నిరుపయోగంగా రైతు బజార్


చక్రాయపేటలో మురుగుకాల్వల వద్ద జరుగుతున్న సంత

చక్రాయపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చక్రాయపేటలో దాదాపు రూ.40లక్షలతో వారపు సంత కోసం షెడ్లను నిర్మించినా ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా ఉన్నాయి. ఏడాది గడుస్తున్నా నిరుపయోగంగా ఉండిపోయాయి. వారపుసంత కోసం రూ.40లక్షల


వారపుసంత కోసం నిర్మించి నిరుపయోగంగా ఉన్న షెడ్లు

పాడా నిధులతో షెడ్లు, బాత్‌రూములు, ట్యాంక్ నిర్మించారు. గత ఎన్నో సంవత్సరాలుగా వెంకటేశ్వర, రాచరాయ దేవస్థానాలు ముందు భాగాన వారపు సంత ప్రశాంతంగా జరుగుతుండేది. అయితే ఆ వారపు సంత ప్రాంతంలో మురుగుకాల్వలు, దేవస్థానం ముందు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మధ్య సంత నిర్వహిస్తున్నారు. అక్కడ సంతకు వచ్చే జనాలు మురుగు కాల్వ దుర్గంధవాసనను భరించలేకపోతున్నారు. మండలంలోని వివిధ ప్రాంతాల గ్రామాల నుంచి భారీ ఎత్తున వారపుసంతకు వస్తారు కానీ సౌకర్యాలు లేకున్నా ఆ మురుగులోనే వారపుసంత జరుపుతున్నారు. చక్కగా భవనం అప్పట్లో ప్రారంభించారు. కానీ అక్కడ సంత ఎందుకు జరపలేకున్నారో అర్థం కాని పరిస్థితి. అధికారుల, పాలకుల నిర్లక్ష్యమా తెలియడం లేదు. ఇప్పటికైనా సంత జరిపించేందుకు కృషిచేయాలని కోరుతున్నారు.

లేబర్ కోడ్‌లను రద్దుచేయాలి

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లు కార్మిక వ్యతిరేకమని, కార్పొరేట్ సంస్థలకు మాత్రమే మేలు చేస్తాయని, వాటిని వెంటనే రద్దుచేయాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్,కడప డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో మహిళా కన్వీనర్ శ్రీకృష్ణ,కో-కన్వీనర్లు వసుప్రద, శ్రీవాణి, నాయకులు పాల్గొన్నారు.

రేపు ఆశా వర్కర్స్ మహాసభ

కమలాపురం రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ నియోజకవర్గ మహాసభ 28న మధ్యాహ్నం 12గంటలకు కమలాపురంలో నిర్వహించనున్నట్లు ఏరియా కార్యదర్శి చంద్రశేఖర్, ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మరియమ్మ, ఏరియా కార్యదర్శి వరలక్ష్మి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కమలాపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదిగిన నాడే సైన్స్ ఉపాధ్యాయుని జీవిత సాఫల్యం

కడప ఎడ్యుకేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మన దగ్గర విద్యాభ్యాసం చేసే విద్యార్థి ఒక శాస్త్రవేత్తగా ఎదిగినప్పుడే ఆ సైన్స్ ఉపాధ్యాయునికి జీవితానికి సాఫల్యం లభిస్తుందని జిల్లా సైన్స్ అధికారి ఎబినేజర్ తెలిపారు. బుధవారం కడపచిన్నచౌక్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో అటల్ టింకరింగ్ ల్యాబ్ (ఏటీఎల్) సంబంధించి ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు మూడురోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ ప్రిన్సిపాల్ మాధవి, డీఆర్‌పీలు ఉమామహేశ్వరి, కృష్ణవేణి, మహబూబ్ బాష తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా ఆశించిన దిగుబడులు


రైతులకు ప్రగతి సూత్రాలను తెలియజేస్తున్న అధికారులు

కడప రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పకృతి వ్యవసాయ పద్ధతులను పాటించడం వలన ఆశించిన దిగుబడులను సాధించవచ్చని అసిస్టెంట్ డైరక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ లక్ష్మీ మాధవి, ఏవో సురేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడప మండలంలోని పాలెంపల్లె, ఉక్కాయపల్లె గ్రామాలలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త అంకయ్యకుమార్, వ్యవసాయశాఖ సిబ్బంది, వీఆర్‌వోలు, వెటర్నరీ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

రైల్ శుభంలో టూవీలర్స్‌కు పార్కింగ్

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడప రైల్వే స్టేషన్‌లో టూవీలర్స్ పార్కింగ్ చేసేందుకు రైల్ శుభం ఏర్పాటు చేయడం జరిగిందని కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. కడపరైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల్లో భాగంగా టూవీలర్ పార్కింగ్ స్థలంలో నిర్మాణాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో టూవీలర్స్‌కు స్టేషన్ ఎదురుగా ఉన్న రైలు శుభంలో పార్కింగ్ చేసేందుకు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థుల ప్రతిజ్ఞ

కడప ఎడ్యుకేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జాతీయ సేవా పథకం-8 ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆచార్య కేఎస్‌వీ కృష్ణారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రాజ్యాంగం పట్ల అవగాహన పెపొందించుకుంటామని విద్యార్థులు స్పష్టం చేశారు. ఆచార్య ఏజీ దాము భారత రాజ్యాంగం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ సంచాలకుడు సుబ్రహ్మణ్యం శర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్షణ లేకపోతే ప్రమాదమే..!


కొక్కిరాయపల్లె సమీపంలో వంతెన కింద రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మరు

చెన్నూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు - ఖాజీపేట మధ్య ఉన్న పెన్నాహైలెవల్ వంతెన మీద కొక్కిరాయపల్లెకు వెళ్లే దారిలో ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె లేకపోవడంతో నిత్యం ఆ దారిన తిరిగే వారు భయాందోళనకు గురవుతున్నారు. దారుల పక్కన ట్రాన్స్‌ఫార్మరు ఏర్పాటు చేసేటప్పుడు కంచె వేయాల్సి ఉంది. అయితే హైవే వారు ఈ ట్రాన్స్‌ఫార్మరును వంతెన కింద కొక్కిరాయపల్లెకు మలుపు తిరిగే ప్రాంతంలో ఏర్పాటు చేశారు. ఇదే ట్రాన్స్‌ఫార్మరు ఆనుకుని పెన్నానదికి పలురకాల పశువులు, ట్రాక్టర్లు, కసువుబండ్లు, రజకులు దిగి వెళుతుంటారు. ఇటీవల ఓ పాడి గేదె ట్రాన్స్‌ఫార్మరు తగిలి మృతి చెందింది. కానీ ఇప్పటి వరకు ఆ ట్రాన్స్‌ఫార్మరు చుట్టూ కంచె వేయలేదు. ఎత్తు తక్కువగా ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మరు వద్ద ఇప్పటికైనా రక్షణ కంచె ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

లింగ వివక్షపై డ్వాక్రా మహిళల ర్యాలీ

పెండ్లిమర్రి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): లింగ వివక్షపై మండల కేంద్రంలో బుధవారం డ్వాక్రా మహిళలు ర్యాలీ నిర్వహించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఐ వెంకట కుమార్ గౌడ్ మాట్లాడుతూ సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని,ఫోన్ ద్వారా ఎవరికీ ఓటీపీలు చెప్పరాదన్నారు పోలీసు రక్షణ కోసం 1098,అత్యవసరం కోసం 112 అనే హెల్ప్‌లైన్ నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీయం బాలస్వామి,లీగల్ కో-ఆర్డినేటర్ గంగరాజు,సమాఖ్య అధ్యక్షురాలు స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను నాణ్యతగా వేయాలి

వేంపల్లె, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సిమెంటు రోడ్లను నాణ్యతగా వేయాలని పంచాయతీరాజ్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. వేంపల్లె పట్టణం ఆర్‌అండ్‌బీ బంగళా నుంచి కళ్యాణమండపం వరకు వేయనున్న సిమెంటు రోడ్డు పనులను బుధవారం డీఈ ప్రారంభించారు. ఈఓ నాగభూషణంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : బీటెక్ రవి



పులివెందుల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారం చేయడమే తన ప్రధాన బాధ్యత అని పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. బుధవారం ఉదయం టీడీపీ కార్యాలయంలో బీటెక్ రవి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు సంజీవరెడ్డి పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ: సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బీటెక్ రవి, జడ్పీటీసీ లత పంపిణీ చేశారు. బుధవారం ఇరువురు వారి ఇంట్లో ఈ చెక్కుల పంపిణీ చేశారు.

సుబ్రహ్మణ్య షష్టి వేడుకల్లో ఎమ్మెల్యే దంపతులు



కడప కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా బుధవారం కలెక్టరేట్ సమీప మహవీర్ సర్కిల్ వద్ద ఉన్న సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో ఘనంగా వేడుక నిర్వహించారు. స్వామివారి మహోత్సవాలకు కడప ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసరెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.





IN THE COURT OF THE 7th ADDITIONAL DISTRICT JUDGE: KADAPA
I.A.No. 373 of 2025 in O.S.No.29 of 2020

Between:
1. Gajjala Rama Chandra Reddy, S/o. G. Subbi Reddy, aged about 53 years, Hindu, Business, resident of 42/347-225, Simhapuri colony, Kadapa City & District. And Others ... Petitioners/Plaintiffs

And

7. Kavuluri Shankar Reddy, S/o. Late K. Eswar Reddy, aged about 35 years, Hindu, Business, resident of D.No.2/402-2A, Balaji Nagar, Chemmumiapet. Kadapa City & District.
8. Kavuluri Babul Reddy, S/o. Late K. Eswar Reddy, aged about 35 years; Hindu, Business, resident of D.No.2/402-2A, Balaji Nagar, Chemmumiapet, Kadapa City & District.
....Respondents no's 7 and 8 / Proposed parties 7 and 8

NOTICE TO THE RESPONDENTS No's 7 AND 8 / PROPOSED PARTIES No's 7 AND 8.

Please take notice that the petitioners / plaintiffs have filed the above I.A. to condone the delay of 525 days in filing legal heir petition in the above suit, stands posted to 05.12.2025 at 10.30 AM, either personally or through advocate, before the said court. If you fail to appear, on the above date, matter will be decided exparte.

//BY ORDER OF THE COURT//
M.SURESH KUMAR, M.A.B.L.,
Advocate for the Petitioners-Plaintiffs,
Kadapa City, A.P. 8500271919

రాజ్యాంగ హక్కులను కాపాడుకుందాం



కడప...సమావేశంలో ప్రమాణం చేస్తున్న నాయకులు, అంబేడ్కర్ చిత్రపటం వద్ద బహుమతులు అందజేస్తున్న వీసీ జయరామిరెడ్డి

కడప మారుతీనగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ హక్కులను కాపాడుకునేందుకు అన్ని వర్గాల ప్రజలు సంఘటితశక్తిగా మారాలని వివిధ రంగాల, వర్గాల ప్రముఖులు పిలుపునిచ్చారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ప్రత్యేక రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాజన రాజ్యం పార్టీ (ఎంఆర్‌పీ) వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు సంగటి మనోహర్, జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున, ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ సలావుద్దీన్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు, బీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు సగిలి గుర్రప్ప, లోక్‌సత్తా పార్టీ జిల్లా కన్వీనర్ దేవర శ్రీకృష్ణ మాట్లాడారు. భారతరాజ్యాంగం స్ఫూర్తిని, విశిష్టతను గొప్పతనాన్ని నలుదిశలా చాటుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి జాతీయ సమన్వయ కర్త షేక్ అమీన్‌పీరా, కేంద్ర కమిటీ సభ్యురాలు షేక్ హుమేరా, జె.వి. రమణ, జెడీఎస్ నాయకులు ప్రతాప్‌రెడ్డి, సీఆర్‌వీ ప్రసాద్, డి.ఎం.ఓబులేసు, పలువురు ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్కిటెక్చర్ వర్సిటీలో...
కడప ఎడ్యుకేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ప్రొఫెసర్ బి.జయరామిరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చెన్నూరు..: భారతరాజ్యాంగంలో అందరూ సమానమేనని ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు అన్నారు. రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా చెన్నూరులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటసుబ్బయ్య అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో గురువేశ్వర్‌రావు, మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు. కాగా మండల విద్యావనరుల కేంద్రంలో ఎస్టీయూ ఆధ్వర్యంలో విద్యార్థులకు భారత రాజ్యాంగంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గంగిరెడ్డి, ఎస్టీయు రాష్ట్ర కౌన్సిలరు బాలగంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రి..: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహించారు.ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో జగన్ మోహన్, జడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య,డిప్యూటీ ఎంపీడీఓ,సిబ్బంది పాల్గొన్నారు.

కమలాపురం రూరల్..: రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత ప్రతి పౌరుడిది అని కమలాపురం జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మధుసూదన్‌రావు అన్నారు. బుధవారం పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. మొదట కోర్టులో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టుసిబ్బందితో కలిసి పాల్గొని రాజ్యాంగం ప్రాముఖ్యతను వివరించారు.

పులివెందుల టౌన్..: భారత రాజ్యాంగంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని లయోలా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ జోజిరెడ్డి పేర్కొన్నారు. కళాశాలలో రాజ్యాంగ దినోత్సవంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కళ్యాణిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ చిన్నప్ప, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లె..: భారత రాజ్యాంగం ప్రపంచంలోని ఉత్తమ రాజ్యాంగమని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ నాయకులతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని ఎన్ఎస్ఎస్ యూనిట్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ గుప్త, ఏఓ రవికుమార్,ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు. కాగా రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఎస్టీయూ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

సీకేదిన్నె..: భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని నాగిరెడ్డిపల్లె సొసైటీ బ్యాంకు ఛైర్మన్ గంధం మోహన్‌బాబు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ హైస్కూలులో బుధవారం భారత రాజ్యాంగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కాగా వైసీపీ ఆధ్వర్యంలో ఊటుకూరు రింగ్‌రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నరేన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చక్రాయపేట..: మన భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం అని ఎంపీడీఓ శివారెడ్డి అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్, గాంధీజీ చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం కళాశాలలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షేక్ రంతు,పంచాయతీ సెక్రటరీ,కళాశాల సిబ్బంది,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.


చెన్నూరు.. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సర్పంచ్ వెంకటసుబ్బయ్య

గిరిజనులకు సబ్సిడీ లోన్లు ఇవ్వాలి

కొండాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు సబ్సిడీ లోన్లు ఇవ్వాలని ఏపీటీఎఫ్ జిల్లా మహిళా అధ్యక్షురాలు డేరా జ్యోతి కోరారు. బుధవారం కడపలో ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్ మేదరి రవికుమార్‌ను కలిసి ఆమె వినతిపత్రాన్ని అందజేశారు. గిరిజనులకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు సబ్సిడీ లోన్లు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు గిరిజనులు రవికుమార్‌ను సన్మానించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన నేతలు జగన్నాథం, సాయి, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు

ముద్దనూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేందుకు ప్రభుత్వం పంచసూత్రాలు అమలు చేసిందని ఏడీఏ రామ్మోహనరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధి నల్లబల్లె గ్రామంలో బుధవారం రైతన్నా మీకోసం' కార్యక్రమం నిర్వహిస్తుంచారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ నీటి భద్రత, డిమాండు ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, వ్యవసాయ రంగంలో ప్రభుత్వ మద్దతు వంటి అంశాలపై రైతులకు వివరించారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో వెంకటకృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ప్రొద్దుటూరుటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవ వేడుకలను విద్యాసంస్థలలో ఘనంగా నిర్వహించారు. బుధవారం పశువైద్య కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రాజ్యాంగ పీఠికపై విద్యార్థులతో ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్, డాక్టర్ ఇందిరలు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రజాస్వామ్య బలోపేతానికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జీవన, పశువైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



జమ్మలమడుగులో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

జమ్మలమడుగు: రాజ్యాంగ విలువలు ప్రతి ఒక్కరూ పాటిస్తూ సమాజానికి ఉపయోగపడాలని జమ్మలమడుగు మండల విద్యాశాఖాధికారులు రమేష్, చంద్రశేఖర్‌రావు సంయుక్తంగా పేర్కొన్నారు. బుధవారం జమ్మలమడుగు మండలంలోని గూడెంచెరువు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈవోలు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో రాజ్యాంగ విలువలు పెంపొందించాలని మన దేశ అత్యున్నత నియమావళి, రాజ్యాంగం గురించి ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. అనంతరం వ్యాసరచన, క్విజ్‌పోటీలు, మాక్‌పోలింగ్, మాక్ అసెంబ్లీ, దేశ విధాన సభ చట్టాలు, తదితర వాటికి సంబంధించి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల: పోరుమామిళ్లలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి, పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్, పంచాయతీ కార్యదర్శి ఓబులేసులు పాల్గొని రాజ్యాం గంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాశ్‌రెడ్డి, ముత్యాల ప్రసాదరావు, ఓబులేసు, మానవ హక్కుల సంఘం నాయకులు గంగన్న తదితరులు పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు బాషా, జడ్పీటీసీ ప్రసాద్, చిత్తాగిరి ప్రణీత్‌రెడ్డి పాల్గొన్నారు.

బద్వేలు: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ సుధ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అన్ని దేశాల్లో కెల్లా మన భారతరాజ్యాంగం అతి పెద్ద రాజ్యాంగం అని దేశంలో ప్రతి వ్యవస్థ మన రాజ్యాంగం ప్రకారం నడుచుకుంటూ ఒక బలమైన వ్యవస్థగా రూపొందాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, అధ్యక్షుడు సుందర రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

- సీపీఎం, సీపీఐ పార్టీలు, ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన

ప్రొద్దుటూరు/ప్రొద్దుటూరుటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన కార్మిక చట్టాలపై దేశవ్యాప్తంగా కార్మిక చట్టాల పిలుపు మేరకు వామపక్ష పార్టీలు నిరసన తెలిపాయి. బుధవారం తహసీల్దారు కార్యాలయం వద్ద కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మిక హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. బ్రిటీష్ పాలనలో కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను ప్రభుత్వం కాలరాయడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి విజయకుమార్, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, చంటి, గంగాధర్, శివ, జాషువా, ముంతాజ్‌బేగం, సర్వేశ్వరి, వెంకటసుబ్బమ్మ, విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

- 12 గంటల పని విధానాన్ని రద్దు చేయాలని ఏఐటీయూసీ నాయకులు శివాలయం సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, మాజీ జిల్లా కార్యదర్శి రామయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణాధ్యక్షుడు చైతన్య, నరసింహ, మధు, మీరావలి, యేసోబు, రవికుమార్, జ్యోతి, వీరమ్మ, తదితరులు పాల్గొన్నారు.
- లేబర్ కోర్టులను రద్దు చేయాలని ఎల్ఐసీ ఉద్యోగులు భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐసీఈయూ బ్రాంచ్ అధ్యక్షుడు బి.టి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ఇటీవల కాలంలో అప్రెంటీస్, తాత్కాలిక నియామకాలు పెరిగిపోయాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షురాలు లీలావతి, జాయింట్ సెక్రటరీలు సుబ్బరాయుడు, జయరాఘవేంద్ర, సౌజన్య పాల్గొన్నారు.

'ముదిరాజ్‌లను బీసీ-ఎలో చేర్చాలి'

బి.కోడూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఎలోకి మార్చాలని టీడీపీ నేత ముదిరాజ్ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం మండల పరిధిలోని ఎం.నరసింహాపురం గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఇరిగేషన్ అధికారులకు పట్టదా ?

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్

బద్వేలు రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పేదల నివాసాలు నీట మునుగుతున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్ ఆరోపించారు. బుధవారం ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి కాలనీ ప్రజలతో కలిసి సీపీఐ రూరల్ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భాకరాపేట సమీపంలోని డంపింగ్‌యార్డు పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో సీపీఐ రూరల్ సమితి ఆధ్వర్యంలో నిరుపేదలు గుడిసెలు వేసుకున్నారన్నారు. ఒక ఏడాది తరువాత చిన్నపాటి రేకుల ఇల్లు నిర్మించుకుని కూలి పనులకు వెళుతూ స్థిరనివాసం ఉన్నారని ఇటీవల కురిసిన వర్షాల కారణంగా చెరువుల్లోకి నీరు వచ్చినప్పటికీ ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి కాలనీ ప్రజలకు సమస్య ఏర్పడలేదన్నారు. అయితే పైనున్న చెరువుల నీటిని చిన్నకేశంపల్లె, పెద్దకేశంపల్లె, శంకరాపురం, శివరామనగర్, చింతలచెరువు, కొంగళవీడు గ్రామాలకు వెళ్లాల్సిన నీటిని ఉద్దేశ్యపూర్వకంగా ఇరిగేషన్, తెలుగుగంగ, రెవెన్యూ అధికారులు ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి కాలనీ వైపు నీటిని మళ్లించడం దుర్మార్గ చర్య అన్నారు. కార్యక్రమంలో సీపీఐ రూరల్ కార్యదర్శి ఇమ్మానుయేల్, ఏరియా సహాయ కార్యదర్శి రమణ, ఏరియా కార్యవర్గ సభ్యుడు వెంకటరమణ, పెంచలయ్య, విజయమ్మ, నాగరాజు, వెంకటేశ్, సుధాకర్, ప్రసాద్ పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి కృషి

మైలవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతన్నల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం పాటుపడుతోందని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని వేపరాల గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రైతన్న మీకోసం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో గురుభాస్కర్, ఎంపీడీవో సోమశేఖర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, మండల నాయకులు పాల్గొన్నారు.

కాలువ పనులకు భూమిపూజ

మండల పరిధిలోని వేపరాల గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులు సుమారు రూ.50 లక్షలతో డ్రైనేజీ పనులకు జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి బుధవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సోమశేఖర్ రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వరరెడ్డి, మండల నాయకులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

మైదుకూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రధానమంత్రి కౌసల్ వికాస్ యోజన ద్వారా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వెబ్ డెవలపర్ జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సులకు ఉచిత కంప్యూటర్ శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ నారాయణరెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ నారాయణరెడ్డి కోరారు.

బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడిగా మారుతి

ప్రొద్దుటూరురూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ ప్రొద్దుటూరు పట్టణ అర్బన్-2 ఉపాధ్యక్షునిగా ఎం.మారుతీకి బాధ్యతలు అప్పగించారు బుధవారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి ప్రదీప్, పట్టణాధ్యక్షుడు పాళెం కిరణ్ కుమార్ చేతుల మీదుగా పార్టీ కార్యాలయంలో ఈ మేరకు నియామక పత్రాన్ని మారుతీకి అందజేశారు. ఈ సందర్భంగా రానున్న మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విక్రాంత్, జయలక్ష్మి, కొర్రపాటి కంబగిరి, మురళి, రవి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై దుష్ప్రచారం తగదు



మాట్లాడుతున్న బీసీ నాయకులు

బద్వేలు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి చేయకపోగా రాష్ట్రాన్ని అభివృద్ధి బాట పట్టిస్తున్న కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయ డం తగదని నాయీబ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ డైరెక్టర్ కె.వేణుగోపాల్ అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ బీసీ సెల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పత్రికలో రోజురోజుకు కూటమి ప్రభుత్వాన్ని విమర్శిస్తూ పతాక శీర్షికలో కథనాలు వస్తున్నాయని, ప్రస్తుతం పథకాలు పొందుతున్న వారు కూడా ఆశ్చర్యపోయేలా ఈ శీర్షికలు వెలువడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఆ పత్రిక తన అసత్య ప్రచారాలకు అడ్డుకట్ట వేయాలని, లేకపోతే ప్రజల్లో అపహాస్యం పాలవక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

'పారిశుధ్య పనులకే కేటాయించాలి'

బద్వేలు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పారిశుద్యేతర పనులకు కాకుండా, పారిశుధ్య పనులకే పారిశుధ్య కార్మికులను కేటాయించాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పారిశుధ్య కార్మికులు సీఎం, డిప్యూటీ సీఎం సంబంధిత మంత్రులకు లేఖల ద్వారా ఫిర్యాదు చేసినట్లు యూనియన్ ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఓబులేసు, కొండయ్య, యూనియన్ పట్టణ అధ్యక్షుడు సత్యరాజు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన వుండాలి

ముద్దనూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళకు చట్టాలపై సమగ్రంగా అవగాహన కలిగి వుండాలని సీఐ దస్తగిరి అన్నారు. స్థానిక ఎస్టీ కాలనీలో బుధవారం మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వైజే పద్మశ్రీ

బద్వేలు రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి వైజే పద్మశ్రీ అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కోర్టు ఉత్తర్వుల మేరకు వరకట్న వ్యతిరేక దినోత్సవం, లా డేను పురస్కరించుకుని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బీజే ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో లీగల్ అవేర్‌నెస్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ప్రభాకర్‌రావు, శ్రీనివాసులు, శివకుమార్, వీరశేఖర్‌రెడ్డి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సంజీవరాయుడిని దర్శించుకున్న డీఎస్పీ



పూజల్లో పాల్గొన్న డీఎస్పీ

రాజుపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన వెల్లాల సంజీవరాయస్వామిని బుధవారం ప్రొద్దుటూరు డీఎస్పీ భావన దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ సిబ్బంది సాదర స్వాగతం పలికారు. శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ సంజీవరాయ స్వామికి నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు గంగిరెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాలకు పట్టం కట్టేది టీడీపీనే : శ్రీనివాసరెడ్డి



చల్లా రాజగోపాల్ ప్రమాణ స్వీకారంలో శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే తదితరులు

ప్రొద్దుటూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలతో పాటు మైనారిటీలకు పట్టంకట్టే పార్టీ ఈ రాష్ట్రంలో టీడీపీ ఒక్కటేనని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం టీడీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్‌తో పాటు పట్టణ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో కడప నగర కమిటీ తరువాత అంత ప్రాధాన్యత గల పదవి ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్ష పదవి అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో వుంచుకోని పార్టీ కేడర్‌ను వార్డు స్థాయిలో బలోపేతం చేయాల్సిన అవసరం వుందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రొద్దుటూరులో టీడీపీకి ముందు నుంచి బీసీల ఓటుబ్యాంకు బలంగా వుందన్నారు. రాజగోపాల్ నాయకత్వంలో పట్టణ కమిటీ సమర్థవంతంగా పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూతన మండల కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, రాష్ట్ర షేక్ వెల్ఫేర్ సొసైటీ కార్పొరేషన్ చైర్మన్ ముక్తియార్, నియోజకవర్గ పరిశీలకుడు ప్రసాద్, పలువురు డైరెక్టర్లు జాకీర్, సుబ్బారెడ్డి, విశ్వ శ్రీనివాసాచారి, తదితరులు పాల్గొన్నారు.

పంచసూత్రాలతో రైతులకు మేలు

ఎర్రగుంట్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సూచించిన పంచసూత్రాలు రైతులకు ఎంతో ఉపకరిస్తాయని కమలాపురం ఏడీఏ నరసింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని హనుమనగుత్తిలో ఆయన రైతులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రికల్చర్ టెక్నాలజీ, ఫుడ్‌ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు వంటి అంశాలను రైతులు పాటిస్తే లాభసాటిగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ఎన్.సుజనకుమారి, సాంకేతిక వ్యవసాయ అధికారి నాగభూషణ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

కేసులను తక్షణమే పరిష్కరించాలి

- మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ

బద్వేలుటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అర్బన్, రూరల్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఉండే పెండింగ్ కేసులను తక్షణమే పరిష్కరించాలని మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం అర్బన్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సంవత్సరం పూర్తి కావస్తున్న నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆయన అధికారులకు సూచించారు.

'ఎస్సీ హాస్టల్‌ను కొనసాగించండి'

బద్వేలురూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల మండలం, టేకూరుపేట ఎస్సీ బాలుర వసతిగృహాన్ని తిరిగి కొనసాగించాలని ఏఐఎస్ఏ జిల్లా కన్వీనరు అనిల్‌కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టరు సరస్వతికి వినతిపత్రం అందించారు. ఈ మేరకు డీడీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, వినయ్, కుమార్ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన



కరపత్రాలు అందజేస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, నవంబరు 26 (ఆంధ్ర జ్యోతి): రైతుల అభివృద్ధి కోసం వెంటపడి సీఎం చంద్రబాబు వారికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని జమ్మలమడుగు మార్కెట్‌యార్డు చైర్మన్ నాగేశ్వరరెడ్డి రైతులకు సూచించారు. బుధవారం జమ్మలమడుగు మండలంలోని ధర్మాపురం గ్రామంలో రైతన్న సేవలో మన మంచి ప్రభుత్వం' కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి కూటమి నాయకులు, రైతులు, అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకుడు అనిత, వ్యవసాయాధికారి శ్రీకాంత్‌రెడ్డి, గ్రామ సెక్రటరీ మాధురి, మార్కెట్‌యార్డు సెక్రటరీ నాగిరెడ్డి, సిబ్బంది హబీబున్నీసా, నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.